క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ చేస్తున్న ఏసీపీ త్రినాథరావు

బీచ్ రోడ్డు: నగరంలోని రౌడీషీటర్లకు ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ త్రినాథ రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచి నడవడిక కలిగితే రౌడీషీట్ క్లోజ్ చేసేందుకు పరిశీలిస్తామన్నారు. కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికకు విశేష స్పందన



పరిచయ వేదికకు హాజరైన వధూవరుల కుటుంబ సభ్యులు

ఎంవీపీ కాలనీ: సెక్టార్–6లోని భద్రం పార్కులో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 500 మంది హాజరు కాగా.. 350 మంది వధూవరులకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు. 12 జంటల కుటుంబ సభ్యులు పరస్పర పరిచయాలు చేసుకుని తదుపరి కార్యచరణకు అంగీకారం తెలుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ విశాఖ వ్యాప్తంగా 10 శాఖల ద్వారా బ్రాహ్మణ వధూవరుల సమాచారం అందుబాటులో ఉందన్నారు.

పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్.వి.నారాయణ

బీచ్ రోడ్డు: సీ షోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వీఎంఆర్‌డీఏ పార్క్ వద్ద పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఆర్.వి.నారాయణ మాట్లాడుతూ నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి భౌతిక, మానసిక వ్యాయామాలే దివ్య ఔషధాలన్నారు. 50 ఏళ్ల వయస్సు దాటిన వారిలో నాడీ కణాలు మెదడును దెబ్బ తీయడం మూలంగానే పార్కిన్సన్స్ వ్యాధి వస్తుందన్నారు. ఈ వ్యాధి వల్ల చేతులు, కాళ్లు, దవడల్లో వణుకు రావడం, కండరాల బిగదీయడం, పట్టేయడం, నిరాశ, భయం, చొంగకారడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. ఈ సదస్సులో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ అచ్యుత్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.సాయిప్రసాద్, పోతన్న రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రోహిణి, సీఐ సోమశేఖర్

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం పక్కన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇజ్జాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, ఆరిలోవ సీఐ సోమశేఖర్ ప్రారంభించారు. అటుగా వెళ్లే ప్రయాణికులు, హెల్త్‌సిటీలోని ఆస్పత్రులకు వెళ్తున్న వారికి మజ్జిగ, మంచినీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.విక్టర్, వానపల్లి ఈశ్వరరావు, పారిపల్లి రామారావు, వెంకట రెడ్డి, వానపల్లి మంగరాజు, సత్యాల వెంకట్ పాల్గొన్నారు.

హరిత వనం.. పరిపాలన భవనం

- ఏయూలో పచ్చదనానికి ప్రాధాన్యం
- ప్లాంటేషన్‌తో ప్రాంగణం కళకళ



సీఆర్ రెడ్డి విగ్రహం చుట్టూ వివిధ రకాల మొక్కలు



పరిపాలన భవనం వద్ద నాటిన వివిధ రకాల మొక్కలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనం హరిత ప్రాంగణంగా కళకళలాడుతోంది. ఆకుపచ్చని మొక్కలు, వివిధ వర్ణాలతో కనువిందు చేసే పుష్పాలు పరిపాలన భవనం చుట్టూ నాటారు. భవనం లోపల సైతం అందమైన మొక్క లు ఏర్పాటు చేశారు. నిత్యం పలు పనులపై పరిపాలన భవనంలోని వివిధ విభాగాలకు వచ్చే వారికి ఆహ్లాదాన్ని పంచేలా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు.

కలర్‌ఫుల్‌గా..

గతంలో పరిపాలన భవనం చుట్టూ ఉన్న ప్రాంతం మాత్రమే వివిధ ఆకుపచ్చని మొక్కలతో కనిపించేది. ప్రస్తుతం ఏయూ వృక్షశాస్త్ర విభాగం నిపుణులు, ఏయూ బ్యూటిఫికేషన్ విభాగం సిబ్బంది సమష్టిగా మరింత అందాన్ని జోడిస్తున్నాయి. వృక్షశాస్త్ర విభాగానికి చెందిన లాండ్‌స్కేపింగ్, బ్యూటిఫికేషన్ విధానాలను ఆచరణలో చూపుతున్నారు.

తక్కువ నీరు.. సులభంగా నిర్వహణ

అందంతో పాటు తక్కువ నీటిని స్వీకరిస్తూ బతికే మొక్కలను ఎంపిక చేసుకుంటున్నారు. వీటిలో ఫ్లవరింగ్, సీజనల్ ప్లాంట్స్‌ను సైతం ఉపయోగిస్తున్నారు. రంగుల పుష్పాలే కాకుండా, వివిధ రంగుల ఆకులను కలిగిన మొక్కలను సైతం పెంచుతున్నారు. ఇప్పటికే పరిపాలన భవనం ఎదురుగా ఉన్న వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహం చుట్టూ అందమైన పుష్పాలతో కనువిందు చేస్తున్న మొక్కలు నాటారు.

ఇండోర్ ప్లాంట్స్

భవనం బయటే కాకుండా లోపల కారిడార్లు, విభాగాల వద్ద కుండీల్లో ఉంచేలా ఇండోర్ ప్లాంట్స్‌ను పెంచుతున్నారు. పరిపాలన భవనం లోపల రెండు అంతస్తుల్లో ఉన్న కార్యాలయాల వద్ద నీడలో పెరిగే మొక్కలను ప్రత్యేకంగా ఎంపిక చేసి పెంచుతున్నారు. వర్సిటీ పరిసరాలకు అనుగుణంగా ఎండ, నీడలో పెరిగే మొక్కలను ఎంపిక చేసి సంరక్షిస్తున్నారు.

ప్రధాన విభాగాల సుందరీకరణ

దశల వారీగా వర్సిటీలోని ప్రధాన విభాగాలు, ప్రిన్సిపాల్ కార్యాలయాలు, కూడళ్ల వద్ద భారీ స్థాయిలో సుందరీకరణ పనులు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. వీటికి అవసరమైన మొక్కలను సైతం బయట నుంచి కొనకుండా వర్సిటీ వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు, బ్యూటిఫికేషన్ విభాగం సిబ్బందిని భాగస్వాములను చేస్తూ నర్సరీని అభివృద్ధి చేయనున్నారు. పలు మొక్కలను మాత్రం కొనుగోలు చేసి వాటి కొమ్మలు, వేర్లు, దుంప నుంచి కొత్త మొక్కలను అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.



భవనం లోపల పెంచుతున్న ఇండోర్ ప్లాంట్స్

2 వేలకు పైగా మొక్కలు నాటాం..



వర్సిటీలో అడుగుపెట్టిన దగ్గర నుంచి రహదారికి ఇరువైపులా అందమైన మొక్కలు నాటే ప్రయత్నం చేస్తున్నాం. అధికారుల కార్యాలయాలు, ప్రధాన విభాగాలను సైతం పూర్తి స్థాయిలో మొక్కలతో నింపనున్నాం. వర్సిటీ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటికే వర్సిటీలో వివిధ ప్రాంతాలలో రెండు వేలకు పైగా మొక్కలు నాటాం.

– డాక్టర్ ఉజ్వల్ కుమార్‌ఘటక్, డీన్, బ్యూటిఫికేషన్–శానిటేషన్

వైవిధ్యత, ప్రత్యేకత..



సుందరీకరణలో వైవిధ్యత, ప్రత్యేకత ఉండేలా కృషి చేస్తున్నాం. దీనిలో భాగంగా సువాసన, కాలానుగుణంగా పుష్పించే మొక్కలు, గాలిని శుద్ధిచేసే మొక్కలు, ఇండోర్ ప్లాంట్స్ వంటి వైవిధ్యమైన మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎదిగే మొక్కలను ఎంపిక చేసి నాటుతున్నాం.

– డాక్టర్ జె.ప్రకాష్‌రావు, పోస్ట్ డాక్టరల్ ఫెలో, బోటనీ విభాగం

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



16వ వార్డులో ప్రజల సూచనలు రాసుకుంటున్న ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు



17వ వార్డులో పథకాల గురించి వివరిస్తున్న గేదెల నాగరాజు, తదితరులు

మద్దిలపాలెం: తూర్పు నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మూడో రోజు ఆదివారం కూడా ఉత్సాహంగా సాగింది. 15, 16, 23 వార్డుల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు వివరాలు సేకరించారు. జీవీఎంసీ 16వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాల గురించి వివరించారు. వారి ఆమోదంతో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు.

17వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. వార్డులోని 158వ నంబర్ సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయలేదన్నారు. పార్టీతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మద్ది లక్ష్మణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు





గురజాడ కళా క్షేత్రంలో క్రైస్తవులనుద్దేశించి మాట్లాడుతున్న పాస్టర్ బ్రదర్ శామ్యూల్ కర్మోజీ

బీచ్ రోడ్డు: నగరంలో ఏసుక్రీస్తు పునరుద్ధాన(ఈస్టర్) పండగను ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మినిస్ట్రీస్, మిరకల్ సెంటర్ చర్చి ఆధ్వర్యంలో సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో జరిగిన ఈస్టర్ ఆరాధన కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రసంగీకుడు, మిరకల్ సెంటర్ చర్చి పాస్టర్ బ్రదర్ శామ్యూల్ కర్మోజీ మాట్లాడారు. క్రీస్తు మానవాళి కోసం 40 రోజులు తన రక్తాన్ని చిందించారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాది మంది క్రైస్తవులు తరలిరావడంతో గురజాడ కళా క్షేత్రం కిక్కిరిసిపోయింది. సిస్టర్ శ్రేష్ఠ కర్మోజీ, బ్రదర్ జోయల్ సోహాస్ బృందాలు ఈస్టర్ పర్వదిన గేయాలు ఆలపించారు.

ఘనంగా ఐక్య పునరుద్ధాన వేడుక సభ

బీచ్ రోడ్డు: గ్రేటర్ విశాఖ ఐక్య పునరుద్ధాన వేడుక సభను ఆదివారం ఆర్కేబీచ్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ అందరి పాపాలను ఏసుక్రీస్తు శిలువ మీద మోసి మన అందరికీ విముక్తి కల్పించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవుల అభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కల్వరి సేవ రత్న పి.వి.ప్రసాద్, రోనాల్డ్ విలియమ్స్ మాథ్యూ, విల్సన్‌బాబు, జెమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.



పునరుద్ధాన వేడుక సభలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

కుటుంబ సభ్యుల చెంతకు ఉమేష్



మానసిక రోగి ఉమేష్‌ను అప్పగిస్తున్న మురళి, పోలీసులు

ఎంవీపీ కాలనీ: మానసిక సమస్యల కారణంగా కుటుంబానికి దూరమైన కబ్బే ఉమేష్(20) అనే యువకుడిని రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళి త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానసిక స్థితి బాగోకపోవడంతో బళ్లారి ప్రాంతానికి చెందిన ఉమేష్ ఇంట్లో నుంచి పారిపోయి కొన్ని రోజుల క్రితం విశాఖ చేరుకున్నాడు. ఆర్కే బీచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడి టూరిజం పోలీసు స్టేషన్ సిబ్బంది త్రీటౌన్‌కు సమాచారం అందించారు. అనంతరం అతన్ని అదుపులోకి తీసుకున్న త్రీటౌన్ పోలీసులు సీఐ రామారావు సూచన మేరకు పెదవాల్తేర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీకి తరలించారు. కొద్ది రోజులుగా ఉమేష్ అక్కడే ఆశ్రయం పొందుతున్నాడు. అయితే రెడ్ క్రాస్ ప్రతినిధులు అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. త్రీటౌన్ పోలీసుల సమక్షంలో ఉమేష్‌ను కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు అప్పగించారు.

యువత భవిత కోసం ఆలోచన అవసరం



ఏఐవైఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న క్షేత్రపాల్

ఆరిలోవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ నాయకుడు క్షేత్రపాల్ అన్నారు. ఆరిలోవ ప్రాంతం అల్లూరి సీతరామరాజు నగర్‌లో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో యువతకు జరుగుతున్న అన్యాయం, సమస్యలను వివరించారు. యువత భవిష్యత్తు గురించి ఆలోచించగలిగినప్పుడే దేశం మంచి మార్గంలో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఆరిలోవ శాఖ అధ్యక్షుడు అప్పలరాజు, చరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే డేను సెలవు దినంగా ప్రకటించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి కోరారు. అక్కయ్యపాలెం హైవే కూడలిలో ఆదివారం జరిగిన ఆటో డ్రైవర్ల ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఆపాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళ మహిళా కార్మికులతో పనిచేయించే విధానం రద్దు చేయాలని కోరారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను నేటి ప్రభుత్వాలు హరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక వర్గ హక్కుల సాధనకు మే 1 జరుగు 137వ మే డేను పోరాట దినంగా పాటించి, వాడవాడలా ఎర్రజెండా ఎగురేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేలం శివ, కె.సత్తిబాబు, సిహెచ్.శంకరరావు, రావికృష్ణ, పి.బాలు, జి.నందీశ్వరరావు, కె.సుందరరావు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



కంచరపాలెం వద్ద ప్లకార్డు చూపిస్తూ అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మర్రిపాలెం: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం మెట్టు, తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధారణపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మళ్ల అప్పారావు మాట్లాడుతూ గతేడాది హెల్మెట్ ధరించక 147 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్టు తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారుడికి కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపి ఇబ్బంది కలిగిస్తున్నవారు, మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి తగు కౌన్సెలింగ్ చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఎయిర్‌పోర్టు ఎస్ఐ వాసుదేవరావు, ఎస్ఐ ఉల్‌హక్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ మాసం.. నియమాల ఆచరణం



రంజాన్ సందర్భంగా ప్రార్థన చేస్తున్న విద్యార్థి

ఏయూ క్యాంపస్: రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైన మాసం. కఠిన ఉపవాస దీక్షను పాటిస్తారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థి రంజాన్ ఉపవాస దీక్ష చేస్తూ.. సమయానికి అనుగుణంగా నమాజ్ ఆచరిస్తూ భక్తి భావాన్ని చాటుతున్నాడు. ఆదివారం బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ విద్యార్థుల వార్షిక సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొనడానికి విచ్చేసిన అఫ్గానిస్తాన్ విద్యార్థి ఇక్రాముల్లా అక్కడే ఉన్న పచ్చికపై కూర్చుని నమాజ్ ఆచరించి దైవభక్తిని చాటుకున్నాడు.

కేంద్రం వైఖరి దుర్మార్గం



ఉక్కు రిలే దీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టి ఏళ్లు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం చలించకపోవడం దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 787వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలో ఇంటక్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శిబిరాన్ని ఉద్దేశించి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే దేశంలో ఏ సంస్థ మిగలదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేస్తే దేశం ఆర్థికంగా మరింత దిగజారిపోతుందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కార్మికులంతా ఐక్యంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ సేవలు అమోఘం



మాట్లాడుతున్న మాజీ వీసీ సత్యనారాయణ

దాబాగార్డెన్స్: హక్కుల పరిరక్షణలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అమోఘమని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వై.సత్యనారాయణ కొనియాడారు. మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగే సమయంలో కౌన్సిల్ ప్రతినిధులు పౌర హక్కుల పరిరక్షణకు చేసే పోరాటం మరువలేమన్నారు. కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు పౌర హక్కులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులుగా తమ వంతు కృషి చేస్తున్నామని, కౌన్సిల్ చేస్తున్న కృషికి తమ సహకారం ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మానవ హక్కులకు సంబంధించి బాధితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ, బీఎస్ లత, మాధవి గణపతి, నిర్మల, డాక్టర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ వాలీబాల్ జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: నెల్లూరులో జరగనున్న అంతర కళాశాలల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏఎంసీ జట్టును వాలీబాల్ సమాఖ్య ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే పి.వి.జి.ఆర్ నాయుడు అభినందించారు. ఈ చాంపియన్‌షిప్ ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరుగుతుంది. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జట్టు ఎంపిక పోటీలు జరిగాయి.

20 కిలోల గంజాయి స్వాధీనం

ఎంవీపీకాలనీ: కృష్ణానగర్ సింహాద్రి హాస్పటల్ సమీపంలో ఓ ఇంట్లో 20 కిలోల గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ నార్కోటిక్ టీం పోలీసులు ఆదివారం రాత్రి దాడులు చేసి ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముంచంగిపుట్టు మండలం బారాడ గ్రామానికి చెందిన చిన్నా అనే వ్యక్తితో పాటు అతని తమ్ముడు, బావ మరిది, బిహార్‌కు చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును మహారాణిపేట పోలీసులకు అప్పగించారు.

సమాజ సేవలో న్యూ హోప్ ఫౌండేషన్



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్: న్యూ హోప్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి ఎంతో మందికి వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఆడిషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లుగా చేనేత కార్మికులు, రైతుల చేయూతకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విశాఖకు చెందిన మహిళలకు ఆడిషన్స్ నిర్వహించామన్నారు. సుమారు వంద మంది ఔత్సాహికులు పాల్గొన్నారని, వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్టు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారికి త్వరలో ఆడిషన్స్ ఉంటాయని చెప్పారు. ఫైనల్ పోటీలు విశాఖలో నిర్వహిస్తామన్నారు. యువ సినీ నటుడు నేత సురేష్‌నాయుడు మాట్లాడుతూ చేనేత కార్మికులు, రైతులకు అండగా నిలుస్తున్న నాగమల్లేశ్వరిని అభినందించారు. అనంతరం మిసెస్ ఉత్తరాంధ్ర విభాగానికి ఎంపికైన విజేత భాగ్యకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

విద్యా వికాసంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న రమాప్రభ, విద్యార్థులు

కంచరపాలెం: వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ కమిటీ, బొట్టా నర్సింగరావు ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఊర్వశి జంక్షన్‌లోని బీఎస్ఆర్ భవనంలో విద్యా–వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విద్యావేత్త కె.రమాప్రభ మాట్లాడుతూ విద్యార్థి దశలో అభివృద్ధి చెంది తే వికాసానికి మార్గాలు దొరుకుతాయన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. విద్యా వికాసంపై పలువురు అడిగిన సందేహలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, బీఎస్ఆర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.